



- ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగానే బ్యారేజీ నిర్మాణ పనులు
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించిన జిల్లా ఎమ్మెల్యేలు
- పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ఇదే సరైన మార్గం
- ప్రభుత్వం అనుమతిస్తే ప్రతిపాదనలు పంపిస్తామని అంటున్న అధికారులు
- బ్యారేజీ పూర్తయితే 50వేల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం

కోర్టా - చనకా బ్యారేజీ కార్పొరేషన్ పరిధిలోకి..

ఆదిలాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి):

కొత్త ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగు.. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తే చాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అంతంత మాత్రంగానే నీటివనరులు అందుబాటులో ఉన్నాయి. దీంతో వానాకాల సీజన్‌లో వర్షాధార పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. సాగునీటి సౌకర్యం లేకపోవడంతో వరిపంట సాగు కనిష్ఠ స్థాయిలోనే కనిపిస్తోంది. ఇప్పటికీ 80 శాతం పంటలను వర్షాధారంగానే పండిస్తున్నారు. మిగితా 20శాతం పంటల సాగు చెరువులు, కుంటలు, చిన్నతరహా ప్రాజెక్టులు, బోరుబావులు, చెక్‌డ్యాంలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. రెండు పంటలకు సరిపడా సాగునీరు లేకపోవడంతో ఏడాదిలో వానకాల పంట సాగుతోనే రైతులు సరిపెట్టుకుంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం జిల్లాలో నమోదవుతోంది. స్థానికంగా నీటి వనరులను ఒడిసి పట్టుకుంటే వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కోర్టా - చనకా, గోముత్రి సాగునీటి ప్రాజెక్టులు, హత్తిఘాట్ పంప్ హౌజ్, కుప్టి ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా నిధుల కేటాయింపు నిలిచిపోవడంతో అడుగు ముందుకు పడడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పై భారీ ఆశలు పెట్టుకున్న జిల్లా ప్రాజెక్టులపై దృష్టి సారించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అంచనా వ్యయాన్ని భారీగా పెంచిన కోర్టా చనకా బ్యారేజి పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. ఈ బ్యారేజిని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. కోర్టా - చనకా బ్యారేజీ ప్రధాన కాల్వల నిర్మాణం పూర్తియితే ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల పరిధిలోని సుమారుగా 50వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది.

పూర్తిగా నిలిచిపోయిన పనులు

గత ప్రభుత్వ హయాంలో 2017లో కోర్టా-చనకా బ్యారేజి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పటికే పలుమార్లు గడువు సమయాన్ని కూడా పెంచుతూ వచ్చారు. అయినా పనులు పూర్తికావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లకు దగ్గర పడుతున్న నయాపైసా విడుదల చేయక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. కోర్టా-చనకా బ్యారేజీ విషయమై జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు పలుమార్లు ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనమే లేకుండాపోయింది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రులు కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో పనుల్లో పురోగతి



కనిపించడం లేదు. గత రెండేళ్లుగా నిధుల మంజూరు పూర్తిగా నిలిచిపోవడంతో పనులు చేయలేమంటూ సంబంధిత కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆశలు వదులుకుంటున్నారు. ముఖ్యంగా ప్రధాన కాల్వల నిర్మాణానికి భూసేకరణ చేయాల్సిఉంది. కనీసం రూ.300కోట్ల వరకు నిధులను మంజూరు చేస్తే కొంత ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది.

ఒత్తిడి చేసే ప్రయత్నం

పెండింగ్ బ్యారేజీగా మిగిలిపోయిన కోర్టా-చనకా పనులను పూర్తి చేసేందుకు జిల్లా ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులను రాబట్టాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలుమార్లు పెండింగ్ ప్రాజెక్టుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా స్పందించక పోవడంతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఇటీవల ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లు కార్పొరేషన్ ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టా-చనకా బ్యారేజీతో పాటు గోముత్రి, పలు ఎత్తిపోతల పథకాలు, కొత్త చెరువుల నిర్మాణంపై అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు దిశానిర్దేశం చేశారు. జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు.

నిధుల కోసమే కార్పొరేషన్!

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి (మిగతా 6వపేజీలో..)



పిప్పల్‌కోటిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

మొహర్రంలో హిందూ ముస్లింల ఐక్యత

- అన్ని పండుగలు ఐకమత్యంగా
- ఆదర్శం పిప్పల్‌కోటి గ్రామం

భీంపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో హిందూ ముస్లిం అనే తేడా లేకుండా అన్ని పండుగలను కలిసి జరుపుకుంటున్నారు. హిందువుల పండుగల్లో ముస్లింలు, ముస్లింల పండగల్లో హిందూలు పాల్గొని మతసామరస్యతను చాటి చెప్తున్నారు. పిప్పల్‌కోటిలో రైతుల పండుగ అయిన పొలాల అమావాస్య, దేవీ నవరాత్రులు, స్థానిక వేంకటేశ్వర ఉత్సవాలు, బోర్ల కుంట జాతర, ప్రస్తుతం మొహరం పది రోజుల పండుగల ఇలా ప్రతీ పండుగలో కుల మత బేధాలు లేకుండా అందరూ భాగస్వాములు అవుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మొహరం సందడి

జిల్లాలో మొహరం వేడుకగా జరిగే ప్రముఖ గ్రామాల్లో పిప్పల్‌కోటి ఒకటి. ఇక్కడ గుండం, ఆటలు, సవర్లకు మలిదలు సమర్పించడం, మొక్కులు తీర్చుకోటంలో హిందూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. మొహరం సందర్భంగా సమాజంలోని రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక అంశాల గురించి హిందూ ముస్లిం సహోదరులు బోనగిరి నర్సింగ్, గంజి వార్ పురుషోత్తం, షేక్ హైదర్, బెండ లచ్చన్న, దాసరి ప్రతాప్‌లు ప్రదర్శించే చిన్న నాటికలు అందరిని ఆకట్టుకుంటాయి. డప్పు వాయిద్యాల నడుమ హసేన్ హుస్సేన్‌లతో అందరూ ఊరేగింపులో పాల్గొంటారు. ఇలా సంవత్సరంలోని ప్రతీ పండుగలో ఈ గ్రామం ఐక్యత చూసి పరిసర గ్రామాల ప్రజలు ఆశ్చర్యపోతుంటారు. అందుకే పండుగ సంస్కృతిలో పిప్పల్‌కోటి ఒక ఆదర్శ గ్రామంగా నిలుస్తోంది.

ప్రతీ పండుగకు హాజరవుతాం

- దండే సుభాష్, మెప్మా జిల్లా అధికారి నిర్మల్



పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన నేను నిర్మల్ జిల్లా మెప్మ అధికారిగా పనిచేస్తున్నాను. ప్రతీ పండుగకు తప్పనిసరిగా పిప్పల్‌కోటికి వెళ్తాము. అంతా కలిసి పండుగల్లో పాల్గొంటాం. మొహరం పండుగలో కూడా కుటుంబంతో సహ హాజరవుతాం.

తరాల నుంచి ఐక్యంగా

- గడ్డం లస్మన్న, మాజీ ఎంపీపీ, పిప్పల్‌కోటి



మా గ్రామంలో తరాల నుంచి ప్రతీ పండుగను వేడుకగా జరుపుకుంటాం. హిందూముస్లిం అంతా అన్నదమ్ముళ్ల కలిసి ఉంటారు. తాతముత్తాతలు చూపిన మార్గంలోనే క్రమశిక్షణతో నడుస్తున్నాం. గ్రామ అభివృద్ధికి, కులమతాలకు అతీతంగా చేయటం మా బాధ్యత.

అన్ని పండుగలు కలిపి జరుపుకుంటాం

- షేక్ పీర్ మహ్మద్ (నాలే హైదర్ సవారి ముజావరీ), పిప్పల్‌కోటి



మా పిప్పల్‌కోటి గ్రామంలో కష్టమైనా, సుఖమైనా అందరం తోడుగా ఉంటాం. గ్రామంలో ఏ సందర్భంలో చూసినా కుల, మత భేదం కానరాదు. పండుగ, శుభ కార్యాలల్లో ఒకరికి ఒకరుగా అన్నట్లు ఉంటాం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని డీపీవో రమేష్ గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానికఎంపీడీవో కార్యాలయంలో సమావేశ మందిరంలో మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పారిశుధ్యపనులు చేయించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్‌వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాస్కర్, ఎంపీవో జీవన్ రెడ్డి, ఉపాధి హామీ ఏపీవో జాధవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేను పక్కాగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, జూలై4 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి జ్వరం, దగ్గు, ఒంటి నొప్పుల వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన పరీక్షలు, వైద్యసేవలు అందించాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ ఆదేశించారు. శుక్రవారం మండలకేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఫీవర్ సర్వేలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలతో ఇంటింటా ఫీవర్ సర్వేపై గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి, వైద్య సిబ్బంది వస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యురాలు పూజిత, హెల్త్‌సూపర్ వైజర్ పవార్ సురేష్, తదితరులున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి: ఎంఈవో

నేరడిగొండ, జూలై4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు ఎంఈవో భూమారెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్రంలోగల ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఇంద్రవెల్లి, జూలై4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గట్టేపల్లి, కొలాంగూడ, నవగూడలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. గ్రామాల్లో పర్యటించి ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన నీటిని తొలగించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ పూజిత, హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి

గుడిహత్నూర్, జూలై4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని గుడిహత్నూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎం.సంజీవ్, ఏఓ రమేష్‌లు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సహకార శాఖ మానిటరింగ్ అధికారి జి. నితిన్, సహకార బ్యాంక్ అధికారి సంతోష్, సంఘం సీఈవో కేంద్రే పండరీ, డైరెక్టర్ ధన్ రాజ్ పాల్గొన్నారు.

18ఏళ్లు నిండిన అందరికీ ఓటు హక్కు

నేరడిగొండ., జూలై4 (ఆంధ్రజ్యోతి): 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ ఖలీం బీఎల్‌ఓలను ఆదేశించారు. అన్నారు. మండలకేంద్రంలోగల రైతు వేదికలో శుక్రవారం బీఎల్‌వోల శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్, మహేష్, ఆర్ఐ నాగోరావ్, సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

- ఆసుపత్రిలో మెడికల్ సర్వీసులపై ఆరా
- ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని నక్షత హాస్పిటల్‌ని కలెక్టర్ రాజార్షిషా శుక్రవారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, చికిత్స విధానాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు, చార్జెస్ బోర్డులు, కంప్యూటరైజ్డ్ బిల్లింగ్ వ్యవస్థ స్కానింగ్, డయాగ్నిస్టిక్ సర్వీసుల ప్రమాణాలు, ఆరోగ్యశ్రీ, డ్రగ్స్ రిజిష్టర్ మెడికల్ నిల్వల నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ఆసుపత్రుల బాధ్యతను గుర్తుచేసేలా అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా సేవలందించాలన్నారు. అనంతరం రోగులతో స్వయంగా మాట్లాడిన కలెక్టర్ వారు పొందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తీసుకున్నారు. హాస్పిటల్‌లో కార్డియాక్ కన్సల్టెంట్ డాక్టర్ పేరును డీఎంహెచ్‌ఓ ఆఫీసులో రిజిస్టర్ చేయనందుకు నోటీసు జారీ చేయాలని డీఎంహెచ్‌ఓకి ఆదేశాలు ఇచ్చారు. రేటు చాట్‌ను స్పష్టంగా రెండు భాషలో పేషెంట్‌కి స్పష్టంగా కనబడేటట్లు ప్రదర్శించాలని, రేట్ చాట్ కంటే అధిక బిల్లు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మెడికల్ షాపును తనిఖీ చేసి లైసెన్స్ కలిగిన ఫార్మాసిస్టు పని చేయాలన్నారు. హాస్పిటల్ యాక్టుకు విరుద్ధంగా ప్రవర్తించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అంతకు ముందు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకున్న వ్యక్తితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్‌రాథోడ్, శ్రీధర్, డాక్టర్ సందీప్ ఐత్వార్, డాక్టర్ శిల్ప, తదితరులున్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

'జీవో 7ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి'

నార్నూర్, జూలై4 (ఆంధ్రజ్యోతి): జీఓ నెంబర్ 7ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం ఉన్న ఆదివాసులకు అన్యాయం చేస్తూ గిరిజనేతరులకు సహకరిస్తోందని అన్నారు. జీవో 49 ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనేతర నాయకులు ఎన్నిక చేసి పూర్తిగా ఆదివాసీ గిరిజన నాయకులు అవమానం చేసిందన్నారు. రాష్ట్రపతి, గవర్నర్‌లు కలిసి అటానమస్ కౌన్సిల్ ఏర్పాటుచేసి ఆదివాసులను కాపాడాలన్నారు. ఎల్‌టీఆర్ కేసు ద్వారా సమగ్ర వివరణను ప్రభుత్వాన్ని అడిగితే తప్పుడు కేసు లు పెట్టి జైలుకు పంపడాన్ని తమ సంఘం తరఫున మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీలకు ఫిర్యాదు చేసి తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలకు కోసం త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నట్లుగా తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేష్, సెడ్మాకే రామరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, తదితరులున్నారు.


పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

బజార్‌హత్నూర్, జూలై4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బజార్‌హత్నూర్ మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన సుకుల్ తరుణ్‌సింగ్ (23) గురువారం సాయంత్రం పనులు పూర్తిచేసుకుని ఇంటికి వచ్చి బహిర్భూమికని చెప్పి వెళ్లాడు. కొద్దిసేపటికి చెరువు కట్ట వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడని స్థానికులు గిర్తించారు. వెంటనే పీహెచ్‌కి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్టు మృతుడి తండ్రి ప్రేంసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింబాజీ తెలిపారు.

బీసీలను మోసం చేసిందే కాంగ్రెస్ పార్టీ

- టీపీసీసీ అధ్యక్షుడు విమర్శలు చేయడం సరికాదు: ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్, జూలై4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలను మోసం చేసింది కాంగ్రెస్‌పార్టీ అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియమకంపై టీపీసీసీ అధ్యక్షుడు చేసిన విమర్శలు సరికాదన్నారు. బీజేపీకి బీసీ అభ్యర్థులే దొరకలేదా అని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యంగ్యంగా మాట్లాడడం సమంజసంకాదన్నారు. కాంగ్రెస్‌పార్టీ గత చరిత్రను పరిశీలిస్తే ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ సీఎం పదవులను అగ్రవర్ణాల వారికే అప్పగిస్తున్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. బీసీ అయిన నరేంద్రమోదీని దేశప్రధాని చేస్తే ఓర్వలేని కాంగ్రెస్ పార్టీకి బీసీల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాటలు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీ మంత్రుల సంఖ్య ఎంతో మహేశ్‌గౌడ్ చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీకి చెందిన ఏడుగురు ముఖ్యమంత్రులు బీసీలేనని తెలిపారు. ఎలాంటి పరిజ్ఞానం లేకుండా మహేశ్‌కుమార్‌గౌడ్ బీజేపీని విమర్శించడం అంటే ఆకాశం మీద ఉమ్మి వేయడమేనని అన్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన రాంచంద్రారావు గత 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షడిని చేసిందన్నారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ రఘుపతి, ఆకుల ప్రవీణ్, లాలామున్న,జోగురవి, కృష్ణాయాదవ్, భరత్, భీంసేన్‌రెడ్డి, ముకుంద్‌రావు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయలశంకర్

జోగురామన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్నకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు.



బోథ్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

ప్రారంభమైన మొహరం వేడుకలు

బోథ్, జూలై4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొహరం వేడుకలు ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో సవారి బంగ్లాల వద్ద పీర్ల కొలహలం ప్రారంభమైంది. బుధవారం రాత్రి నుంచి గురువారం రోజంతా పీర్లను ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఉట్నూర్: మొహరం పండుగ పురస్కరించుకుని గ్రామాలలోని ప్రత్యేక మండపాలలో, సవారీలా బంగ్లాలో ప్రతిష్ఠించిన సవారీలను శుక్రవారం ఊరేగించారు.ఉట్నూర్ పట్టణంలోని శాంతినగర్, పొచమ్మవాడ, పెరికగూడెం సవారిబంగ్లా వద్ద, మారుగూడ తదితర గ్రామాల్లో సవారీలను ఊరేగిస్తూ వీధులలో తిప్పారు.

వైజ్ఞానిక ఉద్యమకారుడు మెస్రం మనోహర్

ఇంద్రవెల్లి, జూలై4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు మెస్రం మనోహర్ 3వ వర్ధంతిని లాక్కుగూడలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలను చైతన్యం చేస్తూ వారి స్థానిక సమస్యల పరిష్కారానికి పనిచేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా నాయకులు మడవి నాగోరావ్ పాల్గొన్నారు.

ఆత్మ చైర్మన్‌గా రాజుయాదవ్ నియామకం

బోథ్, జూలై4 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజుయాదవ్‌ను ఆత్మ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఆత్మ రాష్ట్ర డైరెక్టర్‌గా వ్యవహరించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు కట్టబెట్టిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు మాజీ ఎంపీ సోయం బాపూరావు, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి దాతలు తోడ్పాటు అందించాలి

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ఇచ్చోడ, జూలై4, (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు తోడ్పాటునందించాలని జిల్లా విద్యాధికారి ఎనుగు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇచ్చోడ మండలంలోని కామగిరి ప్రభుత్వ పాఠశాలకు దాతలు నక్కల సంతోష్‌రెడ్డి, నిమ్మల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పెన్ పెన్సిల్‌లను వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. గ్రామస్థులు పాఠశాలకు చేస్తున్న సహాయసహకారాలను అభినందిస్తూ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బిక్కుసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ రాజమణి, గ్రామస్థులు మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమణరెడ్డి, సీఆర్‌పీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న డీఈఓ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జోగు రామన్న

వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే : మాజీ మంత్రి

ఆదిలాబాద్, జూలై4 (ఆంధ్రజ్యోతి): వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో జోగురామన్న జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. మహిళలకు చీరలను పంపిణీ చేశా రు. ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభిం చారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్ర భుత్వమేనని ధైర్యం చెప్పారు. పలువురు అభిమానులు గజమాలతో సన్మానించగా గుస్సాడిలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్, గోవర్ధన్, యూనిస్ అక్బాని, అజయ్, జోగుమహేందర్, కస్తాల ప్రేమల, పండ్లశ్రీను, దాసరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఆషాఢ మాసం వేడుకలు

లోకేశ్వరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు పండుగల ప్రాముఖ్యత విద్యార్థులకు తెలిసి రావడానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆషాఢ మాసం సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయురాలు విద్యార్థినులకు గోరింటాకు తయారు చేసి చేతులకు పెట్టారు.

శ్రీశైలానికి సూపర్ లగ్జరీ బస్సు: డీఎం పండరి

నిర్మల్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పుణ్య క్షేత్రమైన శ్రీశైలానికి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. ఈ బస్సు ఈ నెల 9న బుధవారం రాత్రి 8 గంటలకు నిర్మల్ బస్టాండ్ నుంచి బయలుదేరి గురువారం ఉదయం 6 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందని, శ్రీశైలం నుంచి సాయంత్రం 4 గంటలకు బయలుదేరి ఉదయం 2 గంటలకు నిర్మల్ చేరుకుంటుందని, ఛార్జీ ఒకరికి 2,250 ఉంటుందని ఈ సదవకాశాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

నిర్మల్‌లో మాజీ సీఎం రోశయ్య జయంతి

నిర్మల్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ డా.రోశయ్య జయంతి శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు నరసింహా రెడ్డి, రమణ, సరోజ, విష్ణువర్ధన్, శ్రీకాంత్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, ఇతర శాఖల అధి కారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ రోశయ్య సుదీర్ఘ కాలంగా ప్రజా సేవలో నిమగ్నమై, చేసిన దేశ సేవ, పరిపాలన పటిమ, నిష్కళంక రాజకీయ జీవితాన్ని స్మరించుకున్నారు.

ఆదివాసీ ట్రైనింగ్ కో ఆర్డినేటర్‌కు సన్మానం



సునీల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న ఛత్తీస్‌ఘడ్ ప్రతినిధులు

ఉట్నూర్, జూలై 4 (ఆం ధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లో 3 రోజుల పాటు జరిగిన ఆదివాసీ ట్రైనింగ్ క్యాంప్‌లో పీసీసీ మాజీ అధ్యక్షుడు మోహన్ మర్కంజిని బ్యాడ్జితో ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధి సునీల్ జాదవ్‌ను ఛత్తీస్‌ఘడ్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఆదివాసీ ట్రైనింగ్ ఇన్‌చార్జీ రాహుల్ బల్, రాజ్యసభ సభ్యురాలు సావిత్రి మండావి జి.మొహేలమాన్ పూర్ శాసన సభ్యులు ఇంద్రసహా మండవి, జిల్లా అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ సుభద్ర సలాం రాష్ట్ర ముఖ్య నాయకులు ఉన్నారు.

పైలెట్ ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారం

ఉట్నూర్, జూలై4(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పైలెట్ ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల పరిష్కారం, బహిరంగ విచారణ వేదిక నుంచి గ్రామీణుల సమస్యలు పరిష్కరిస్తామని పైలెట్ ప్రజావాణి ప్రిసైడింగ్ ఆఫీసర్ కె.సుధాకర్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద పైలెట్ ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి గిత్తేరమేష్, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ప్రేమ్‌నివాస్, ప్రత్యేక ప్రజావాణి కోఆర్డినేటర్ శ్రీహర్ష, కిసాన్‌మిత్ర మండల కో ఆర్డినేటర్ కుమ్ర వినాయకరావు పాల్గొన్నారు.

'రిమ్స్‌లో మెరుగైన వైద్యం అందడం లేదు'

ఆదిలాబాద్‌అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ఆసుపత్రి అసౌకర్యాల నడుమ సాగుతోందని మెరుగైన వైద్యం అందేది ఎప్పుడని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. శుక్ర వారం లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రలో భాగంగా జిల్లా కేంద్రం లోని రిమ్స్ ఆసుపత్రిని పరిశీలించి రోగులతో మాట్లాడారు. రిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందడం లేదని, కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టు లేక పేదలు మరణిస్తున్నారని అన్నారు. ఇందులో నాయకులు అన్నల లక్ష్మణ్, అగ్గిమల్లగణేష్, దర్శనాల సుష్మ, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పీర్ల పండుగ

కుంటాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతియేటా నిర్వహించే మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజు మండలంలోని కల్లూరుతో పాటు ఆయా గ్రామాల్లో ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

చోరీకి పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

సారంగాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చోరీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణ అన్నారు. శుక్రవారం సెల్ ఫోన్‌లలో ఉన్నటువంటి యాప్‌లా ద్వారా డబ్బులను కాజేసిన బాలున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సారాంగాపూర్ మండలంలో గల ఆలూర్ గ్రామానికి చెందిన దండు రవికిరణ్ నిర్మల్‌కు చెందిన రవికుమార్‌లు నిర్వహిస్తున్న కిరాణా దుకాణాలలో ఓ బాలుడు వారం రోజుల క్రితం నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి వెళ్లి కిరణ్‌షాప్‌ల యజమానుల సెల్‌ఫోన్‌లను దొంగలించి చోరీ చేసినట్లు ఫోన్‌లలో ఉన్నటువంటి ఫోన్‌పేయాప్‌ల నుంచి డబ్బులను కాజేసినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుర గ్రామంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం తోట దేవన్న(52) కొంత కలంగా మద్యం తాగుటకు బానిసై ఎలాంటి పనులు చేయకుండా ఊరిలో తిరుగుతుండేవాడు. భార్య, కుమారులు మద్యం తాగడం మాని వేయమని మందలించగా మనోవేదనకు గురై గురువారం రాత్రి ఇంట్లో ఉన్నటువంటి గుర్తు తెలియని పురుగల మందు తాగగా అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో నిర్మల్ పట్టణంలోని దేవేందర్ రెడ్డి హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రతిభ చాటిన ప్రభుత్వ విద్యార్థులు

- ఆర్జీయూకేటీకి 88 శాతం ఎంపిక కాగా.. 79.2 శాతం మంది గ్రామీణ పాఠశాల విద్యార్థులే..
- తీవ్ర పోటీ మధ్య సీటు దక్కించుకున్న విద్యార్థులు

బాసర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ 2025-26 ప్రవేశాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏకంగా 88శాతం మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అందులో 79.2 శాతం మంది విద్యార్థులు ఎలాంటి హాస్టల్ వసతి లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో గల పాఠశాలలలో చదివి సీటు దక్కించుకున్నారు. శుక్రవారం ఆర్జీయూకేటీ ఎంపిక జాబితాను వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ ఓఎస్డీ మురళీదర్శన్ విడుదల చేశారు. బాసర క్యాంపస్‌తో పాటు మహబూబ్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్‌కు సంబంధించి మొత్తం 1690 మంది ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. మొత్తం 20258 దరఖాస్తులు రాగా అందులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నుంచి 15,316 నుంచి వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 176 మంది విద్యార్థులు అప్లై చేశారు. రాష్ట్ర విభజన నిబంధన తొలగిపోవడంతో ఈ సారి మొత్తం సీట్లను ఏపి విద్యార్థులు లేకుండా తెలంగాణ విద్యార్థులతో భర్తీ చేశారు. సుమారు ఏడాదికి లక్షన్నర ఫీజుతో చెల్లించే కోటా కింద 75 సీట్లకు 1670 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఏడాదికి లక్షన్నర చెల్లించే సీట్లక సైతం తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది.



జాబితాను విడుదల చేస్తున్న ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్

● కౌన్సెలింగ్‌కు రాకుంటే సీటు గల్లంతే..

తీవ్ర పోటీ మధ్య ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్ జరగనుంది. ఎంపికైన విద్యార్థులకు యూనివర్సిటీ నుంచి మెసేజ్ పంపించనున్నారు. లేదంటే.. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పేర్లను చెక్ చేసుకొని విద్యార్థులు కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉంటుంది. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కేటాయించిన తేదీల్లో విద్యార్థి గైర్హాజరైనట్లైతే.. సీటు క్యాన్సల్ అవుతుందని యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేశారు. ఇలా గైర్హాజరైన విద్యార్థుల సీట్లను వెయిటింగ్ లిస్ట్ నుంచి భర్తీ చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 104మంది ఎంపికయ్యారు. నిర్మల్ జిల్లా నుంచి 34(597 దరఖాస్తులు) ఆదిలాబాద్ నుంచి 35 (395), మంచిర్యాల నుంచి 30(507) మంది, కొమురంభీం 5(127) మంది ఎంపికయ్యారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి 297 మంది, అత్యల్పంగా జయశంకర్ జిల్లా నుంచి ఒకరు సీటు పొందారు.

● కేటగిరీ వైజ్‌గా కటింగ్ మార్కులు

ప్రవేశాల్లో అన్ని కేటగిరిల్లో తీవ్ర పోటీ నెలకొంది. ఓపెన్ కేటగిరిలో కటింగ్ మార్కులు 579 ఈడబ్ల్యూఎస్ 564, బీసీ ఏ 571, బీసీ బీ 578 బీసీ సీ 534 బీసీ డీ 579 బీసీ ఇ 566 ఎస్సీ కేటగిరీ వన్ 566, ఎస్సీ కేటగిరీ టు 568 ఎస్సీ కెటగిరి 572 ఎస్టీ 568 మార్కులు కటాఫ్ మార్కులుగా నమోదయ్యాయి. బీసీ సీ మినహాయిస్తే.. ప్రతీ కేటగిరీలో 10వ తరగతిలో 564 మార్కుల కంటే ఎక్కువ వచ్చిన వారే ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించారు. ప్రభుత్వ రెసిడెన్షియన్ కాకుండా డే స్కాలర్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు సబ్జెక్టుకు నాలుగు మార్కులు కలిపి ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పించారు.

● ఈ ఏడాది నుంచి కొత్త ట్రిపుల్ ఐటీ

ఇప్పటి వరకు రాష్ట్రంలో బాసరలో ఉన్న ఒక్క ఆర్జీయూకేటీ మాత్రమే ఉండటంతో రాష్ట్ర వ్యాప్త విద్యార్థులకు ప్రవేశాల్లో తీవ్రపోటీ ఏర్పడేది. మరికొన్ని క్యాంపస్‌లను ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా రోజుల నుంచి ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో కొత్త సెంటర్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతానికి తాత్కాలిక భవనాలను సిద్ధం చేసినట్లు వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ తెలిపారు. తరగతి గదులతో పాటు అన్ని వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీన 211 మంది విద్యార్థులతో తరగతులను ప్రారంభిస్తున్నట్లు వీసీ తెలిపారు. కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

నిర్మల్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వెనుబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య శ్రామిక ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడని, ఆయన ఆదర్శాలను నేటి తరం భావి ప్రజలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు నరసింహా రెడ్డి, రమణ, సరోజ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించినట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన పోరాట మార్గాన్ని, ప్రజలకు కల్పించిన చైతన్యాన్ని, భూమి, భుక్తి, విముక్తి లక్ష్యాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగారాం, అతిక్, మాణిక్ రవు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: దొడ్డి కొమురయ్య చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి యువత స్ఫూర్తి పొందాలని సీపీఎం ఏరియా కన్వీనర్ అవర్గ ముత్యం అన్నారు. తొలి అమరుడిగా చరిత్రలో నిలిచిన ధీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని దిలావర్‌పూర్ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీ ఎస్ సభ్యులు గుర్రపు మల్లయ్య, అప్పాల రాజన్న, కర్రోళ్ల గంగాధర్, కర్రోళ్ల మాణిక్ రావు, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: తెలంగాణ రైతాంగం సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తి దాయకమని మాజీ ఎంపీటీసీ డి. భూమేష్ అన్నారు. ని యోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. విఠల్, ఊరేకర్ సాయన్న, ఎన్. బీరప్ప, శివాజీ, బీరన్న, చిన్న విఠల్, దేవుబాయి పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఖానాపూర్: మండలంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విద్యానగర్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ముఖ్య అతిగా హాజరై ప్రసంగించారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ జిల్లా నాయకులు డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, సుంచుల నారాయణ, తదితరులు హాజరై ఘనంగా నివాళులర్పించారు.

కోర్టా-చనకా బ్యారేజీ కార్పొరేషన్ పరిధిలోకి..

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో కోర్టా-చనకా బ్యారేజి పనులను పూర్తి చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. కోర్టా-చనకా బ్యారేజిని కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొస్తే అవ సరమైన నిధులను సమకూర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్న అంచనా వేస్తున్నారు. కార్పొరేషన్ ద్వారా బ్యాంకులు రుణాలను ఇచ్చే అవకాశం ఉంటుంది. దీనిద్వారా బ్యారేజి పనులను పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరును అందించాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ నిర్ణయం మంచిదే అయినా రాష్ట్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తేనే ఫైల్ ముందుకు కదిలే అవకాశం ఉంటుంది. జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రతిపక్ష పార్టీలకు చెందినవారే కావడంతో ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆదేశిస్తేనే ప్రతిపాదనలు పంపించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు రాబట్టడమా లేదా కొత్తగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దానిద్వారా నిధులను సమకూర్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

హోటళ్లను తనిఖీ చేసిన మున్సిపల్ అధికారులు

నిర్మల్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక మీనా ఇడ్లీ సెంటర్‌ను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన యజమానికి రూ. 5 వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, సాని టరీ ఇన్స్‌పెక్టర్లు దేవదాస్, ప్రవీణ్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి భూమిపూజ

నర్సాపూర్(జి), జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న జరగనున్న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నర్సాపూర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న గద్దె నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రవితో పాటు బీజేపీ మండలాధ్యక్షుడు బర్కుంట నరేందర్, అలాగే బర్కుంట ముత్యం హాజరయ్యారు.

12న ఖానాపూర్‌లో జాబ్ మేళా

ఖానాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన పట్టణంలోని ఏఎంకే ఫం క్షన్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జాన్సన్ నాయక్ పీఆర్‌వో సాబీర్ పాషా వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 60కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాకు హాజరై నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు తీసుకుంటారన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

ముథోల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకం ఇకంద ఇళ్ల నిర్మాణం ముథోల్ మండలంలో చురుగ్గా కొనసాగుతుంది. మండలానికి 489 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇళ్లను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభివ్ ఆదేశాల మేరకు ఎంపీడీవో శివ కుమార్ శుక్రవారం విట్టోలితో పాటు పలు గ్రామాలను సందర్శించారు. ఇందిరమ్మ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులను ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు, ఇందిరమ్మ కమిటీల సహకారంతో లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు.

అధికారికంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి

ఆదిలాబాద్‌అర్బన్,జూలై4(ఆంధ్రజ్యోతి):వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య ఉద్యమించారని జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొముర య్య చేసిన పోరాటాలు, చైతన్య కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమం లో దనపు కలెక్టర్ శ్యామలాదేవి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భూమికోసం భుక్తి కోసం బడుగుల విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమరయ్య నేటి సమాజా నికి ఆదర్శప్రాయుడని సోనాల మండల కురుమ సంఘం అధ్యక్షుడు కసి ర పోతన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామ య్య, శంకర్, సెక్రెటరీ సదానందం, సభ్యులు పోతన్న, లక్ష్మయ్య, శ్రీకాంత్, సాయి, చిన్నారెడ్డిలతో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు

ఆదిలాబాద్‌అర్బన్, జూలై4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం దివంగత నేత కోణిజేటి రోశయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రోశయ్య చిత్ర పటానికి కలెక్టర్ రాజార్షిషా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మె ల్సీ, మంత్రి, ముఖ్యమంత్రి ఇలా అనేక పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేశారని కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తవార్ తదితరులున్నారు.

'మంత్రి సీతక్కను ట్రైబల్ మినిస్టర్‌గా నియమించాలి'

ఉట్నూర్ జూలై4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కేటాయించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌చార్జీ మంత్రిగా కొనసాగించాలని ఆదివా సీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూరు దాదిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ కేంద్రంగా ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ సంఘాల నాయకులతో నిర్వహించి న రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి సీతక్కను ఇన్‌చార్జీ మంత్రిగా నియమించాలని, గిరిజన సంక్షేమశాఖ కేటాయించాలని తీర్మాణించారు.

రోడ్లపై మురికి నీరు రాకుండా చర్యలు

తలమడుగు జూలై4 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని పలు వీధుల గుండా పర్యటించి మురికి నీరు నిల్వ ఉన్న చోట వాటిని శుభ్రపరి ఈగలు దోమలు వ్యాప్తి చెందకుండా మందులను పిచికారి చేయించారు అంతేకాకుండా ఇళ్లలో ను కూడా మురికి నీరునిల్వ ఉండకుండా శ్రద్ధవహించాలని సూచించారు. ఇందులో పంచాయతీ సెక్రెటరీ గజానంద్, టిఆర్ఎస్ పార్టీ నాయకులను సునీత రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సాపూర్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

నర్సాపూర్(జి), జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. నందన్, చాక్‌పల్లి, నర్సాపూర్, నసీరాబాద్ శివారు ప్రాంతాల్లో పంట భూములు ఉన్న రైతులు ఈ కార్యక్రమంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏఈవోలు (అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు) రమ్య (చాక్‌పల్లి క్లస్టర్), భాగ్యలక్ష్మీ (నర్సాపూర్ క్లస్టర్) రైతులకు సహకరించారు. ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలను రైతులకు సులభతరం చేసే లక్ష్యంతో ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలి

● ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఆదిలాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం పెన్‌గంగాభవన్‌లో ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని రిజర్వాయర్, చెక్‌డ్యాంల పనుల పురోగతి, బిల్లుల మంజూరుపై ఆరా తీశారు. ముఖ్యంగా దేగామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజక వర్గంలో 19 చెరువుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పిప్పల్‌కోటి రిజర్వాయర్, దేగామ రిజర్వాయర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే తేజాపూర్, బుగారం, పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్‌ల పై సమీక్షించారు. అలాగే కజ్జర్ల, మత్తడివాగు, చింతలబోరి, పురుషోత్తంపూర్, సీతాగొంది కెనాల్ల మరమ్మత్తుల పై చర్చించారు. నియోజక వర్గంలో కొనసాగుతున్న 11చెక్‌డ్యాంల పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో ఇరిగేషన్ ఎస్ఈ ఈఈ రవీందర్, డీఈ మనోహర్, సుభాష్, మురళి తదితరులు ఉన్నారు.



అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మాజీ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోథ్ ఎమ్మెల్యే

మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగురామన్నకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జోగురామన్న ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా సింగారపు స్వామి

నేరడిగొండ, జూలై4 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ. అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఏటీఎంఏ) నూతన డైరెక్టర్‌గా నేరడిగొండ మండలం తేజపూర్ గ్రామానికి చెందిన సింగారపు స్వామి శుక్రవారం నియమితులయ్యారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

'లక్కీషా బంజారాను ఆదర్శంగా తీసుకోవాలి'

నార్నూర్, జూలై4 (ఆంధ్రజ్యోతి): బంజారా సమాజం మహనీయులు లక్కీషా బంజారాను ఆదర్శంగా తీసుకోవాలని, వారి అడుగుజాడల్లో నడవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన 445వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, యశ్వంత్రవు చవాన్, పాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె, జాదవ్ రెడీ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ దాదే అల్లి, పెసా కమిటీ కోఆర్డినేటర్ సికెందేర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు ఆదివాసీల మద్దతు

ఉట్నూర్, జూలై4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరగనున్న సార్వత్రిక కార్మిక రైతు, కర్షక సమ్మెకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మద్దతు తెలిపింది. ఉట్నూర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసంసచిన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక ఆదివాసీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో ఆదివాసీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆడపిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

తలమడుగు, జూలై4(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు బాగా చదివచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి బాయి అన్నారు. మండలంలోని ఉమ్రిలో గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనంపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వంటశాల ప్రదేశం వంట పాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. నాసిరకం బియ్యం, కూరగాయలతో వంట చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణ, నాయకురాలు సునీత రెడ్డి.వర్ధన్ హిరమన్ ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోథ్, జూలై4 (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో వివిధ తరగతులలో ఖాళీలు ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వళిత పేర్కొన్నారు.

బోథ్ ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలి

బోథ్, జూలై4 (ఆంధ్రజ్యోతి): బోథ్ సివిల్ ఆసుపత్రిలో డాక్టర్ల నియమించామని అధికారులు, నాయకులు చెప్తున్నా ఆసుపత్రిలో వైద్యం అందడం లేదని టీడీపీ మండల కన్వీనర్ మల్లెపూల శివారెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మూడున్నరగంటల ప్రాంతంలో వైద్యం కోసం వెళితే వైద్యులు ఎవరూ లేరని, దీనిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖర్గే సమావేశానికి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ఆదిలాబాద్, జూలై4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ఆధ్వర్యంలో నిర్వహించిన జైబాపు జైభీమ్ జై సంవిధాన్ సమావేశానికి ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి భారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ సీనియర్ నేత గిమ్మసంతోష్ జెండా ఊపి కార్యకర్తల బస్సులను ప్రారంభించారు. అసెంబ్లి ఇన్‌చార్జీ కంది్రశీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బస్సు సర్వీసులతో పాటు 18 కార్లలో 300ల మంది కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలి వెళ్లినట్లు తెలిపారు. ఎల్బీస్టేడియంలో నిర్వహించే ముఖ్య కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షుల సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు వెళుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమ్మేళనానికి నియోజకవర్గంలోని మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు బయలుదేరారు.

ఇంద్రవెల్లి: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న సామాజిక న్యాయ సమరభేరి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ప్రతీ గ్రామానికి పార్టీ బాధ్యులు వాహనాలను సమకూర్చడంతో పెద్దఎత్తున సభకు తరలించారు. తరలివెళ్లన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షులు ఎండీ జహార్, జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, సోమోరే నాగోరావు, ఎండీ జునైద్, చాకటి మానిక్ రావు, జల్పేట్ మారుతి, తదితరులు ఉన్నారు.


రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.


గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.


జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, అర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలోమీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

ఫటా..ఫట్...

పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు

● మహ్మద్ అనీస్ (సానిటరీ ఇన్స్‌పెక్టర్, మున్సిపల్ కార్యాలయం, భైంసా)



ఆంధ్రజ్యోతి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్య నిర్వాహణ చర్యలు ఏమిటి?

సానిటరీ ఇన్స్‌పెక్టర్ : ప్రణాళిక బద్ధంగా మురికి, మురుగు కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగింపచేస్తున్నాం. చెత్త,చెదారం, వ్యర్థ పదార్థాలను ప్రతినిత్యం సేకరించి డంప్ యార్డులకు తరలిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి తలెత్తుతున్న ఇబ్బందికర పరిస్థితుల నివారణకు చర్యలేమిటి?.

సానిటరీ ఇన్స్‌పెక్టర్: ప్రాంతాల్లో నీరు నిలుస్తుండటం మూలంగా మురికి కాలువలకు అనుసంధానంగా కచ్చ కాలువలను ఏర్పాటు చేసి నీటి నిల్వ లేకుండా చర్యలు చేపడుతున్నాం..

ఆంధ్రజ్యోతి: పట్టణ వాసులకు ఇచ్చే సలహా ఏంటి.?.

సానిటరీ ఇన్స్‌పెక్టర్: ప్రతి ఒక్కరు తమ తమ నివాస గృహంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి.

● (ఆంధ్రజ్యోతి, భైంసా)


భైంసా ఏరియా ఆసుపత్రి


ఐపీవీ టీకా


పిల్లలకు అందిస్తున్న రోటా వ్యాక్సిన్


చిన్నారికి వేస్తున్న పల్స్ పోలియో చుక్కల మందు

ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరత

- నిర్మల్ జిల్లాలో షుగర్ బాధితులకు అందుబాటులో లేని ఇన్సూలిన్
- నిండుకున్న చిన్న పిల్లలకు అందించే టీకాల నిల్వలు
- పోలియో చుక్కలూ కరువే..

భైంసా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులకు సరియైన రీతిలో మందుల సరఫరా కావడం లేదు. వ్యాధుల బెడద, రోగుల సంఖ్య అధికంగా ఉంటుండంతో అంతంత మాత్రంగానే సరఫరా అవుతున్న మందులు ఎంత మాత్రం సరిపోవడం లేదు. ప్రధానంగా షుగర్ బాధితులకు అందించే ఇన్సులిన్ వైల్స్ నిల్వలు అన్ని ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో నిండుకున్నాయి.ఇక చిన్న పిల్లలకు అందించే ఐపీవీ టీకాలతో పాటు రోటా మందు సీసాలు సైతం అందుబాటులో లేకుండా పోతున్నాయి. చివరకు పోలియో చుక్కల మందు సక్రమంగా అందించడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. నిండుకున్న మందులను త్వరితగతిన ఆసుపత్రులకు తెప్పించుకోవడంలో ఆయా ఆసుపత్రుల నిర్వాహక వైద్యాధికారులు, సకాలంలో మందులను సరఫరా చేయడంలో స్టోర్ నిర్వాహకులు విఫలమవుతుండటంతో షుగర్ బాధితులకు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు

● రెండు నెలలుగా నిలిచిన ఇన్సూలిన్ సరఫరా

జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ ఆసుపత్రులు, ప్రధాన ఆసుపత్రులకు రెండు నెలలుగా ఇన్సులిన్ సరఫరా నిలిచిపోయింది. జిల్లాలోని ఆసుపత్రులలో అవుట్ పెషెంట్ విభాగంలో ఎక్కడ కూడా షుగర్ బాధితులకు ఇన్సులిన్ అందడం లేదు. ప్రధాన ఆసుపత్రులలో ఇన్‌పెషెంట్‌లో చేరిన రోగులకు అత్యవసర పరిస్థితుల్లో అందించేందుకు అక్కడక్కడ కొద్దిమేర ఇన్సులిన్ నిల్వలు ఉన్నట్లుగా తెలిసింది. ప్రభుత్వాసుపత్రులలో ఇన్సులిన్ వైల్స్ అందుబాటులో లేకపోవడంతో షుగర్ బాధితులు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఇన్సులిన్ అవసరమైన షుగర్ బాధితులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ మెడికల్స్‌లలో ఇన్సులిన్ వైల్స్ కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న షుగర్ బాధితులు ప్రైవేట్‌లో ఇన్సులిన్ కొనుగోలు చేయలేక, ప్రభుత్వాసుపత్రులలో ఇన్సులిన్ అందుబాటులో లేక పాట్లు పడుతున్నారు.

● చిన్నారుల టీకాలు, పోలియో మందుల కొరత

జిల్లాలో భైంసాలో ఏరియా ఆసుపత్రి, ముథోల్, నర్సాపూర్ (జి), ఖానాపూర్ కమ్యూనిటీ ఆసుపత్రులతో పాటు 17 ప్రాథమిక ఆసుపత్రులు, మూడు అర్బన్ ప్రాథమిక ఆసుపత్రులలో చిన్న పిల్లలకు టీకాలు అందిస్తున్నారు. అయితే గత కొంత కాలంగా చిన్న పిల్లలకు అందించే వివిధ టీకాల సరఫరా సరిపోయేంతగా జరుగడం లేదని తెలిసింది. అపుడే పుట్టిన పిల్లలకు అందించాల్సిన పోలియో చుక్కల మందు సరఫరా సైతం అంతంత మాత్రంగానే ఉంటున్నట్లుగా సమాచారం. గత మూడు రోజులుగా భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వ్యాక్సిన్ కేంద్రంలో పోలియో చుక్కలు నిండుకోవడంతో చిన్నారులకు అందించలేని పరిస్థితి నెలకొంది. గురువారం ఇతర ఆసుపత్రుల నుంచి సర్దుబాటు చేసి పోలియో చుక్కల వైల్స్‌ను ఇక్కడికి తెప్పించి చిన్నారులకు అందించే చర్యలు చేపట్టారు. ఇక చిన్నారులకు అందించే ఐపీవీ వైల్స్, రోటా వ్యాక్సిన్ మందుల కొరత నెలకొంది. గత కొంత కాలంగా వీటి సరఫరా సక్రమంగా లేకపోవడం మూలంగా సమస్యలు తలెత్తుతున్నాయి. భైంసా ఏరియా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఐపీవీ వైల్స్, రోటా వ్యాక్సిన్ నిల్వలు నిండుకున్నట్లుగా తెలిసింది. ఉన్నత వైద్యాధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి చిన్న పిల్లలకు అందించే అన్ని రకాల టీకాలను సరిపోయేంతగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలిన పిల్లల తల్లితండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


ఇన్సూలిన్ వైల్స్

● ఇన్సూలిన్ కొరత ఉంది
డా.సురేష్ (డీసీహెచ్ఎస్, నిర్మల్)

అంతటా ఇన్సులిన్ కొరత నెలకొని ఉంది. అత్యవస బాధితులకు అందించేందుకు కొద్దిమేర నిల్వలు అందుబాటులో ఉంచాం. సంబంధిత సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే ఇన్సులిన్ వైల్స్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.


● చిన్నారుల టీకాల కొరత రానీయకుండా చర్యలు
డా. రాజేందర్ (డీఎంఅండ్‌హెచ్‌వో, నిర్మల్)

ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు అందించే టీకాల కొరత రానీయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవి నిండుకోక ముందే టీకాల సరఫరా అయ్యే విధంగా చూస్తాం. అన్ని కేంద్రాల్లో పోలియో మందులు అన్ని వేళల అందుబాటులో ఉండేలా వ్యవహరిస్తాం, ఐపీవీ, రోటా వ్యాక్సిన్ నిల్వలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీలో.. క్షేత్ర సహాయకులకు అందని వేతనాలు

- భారంగా మారిన కుటుంబ పోషణ
- పట్టించుకోవాలని ఏపీవో, టీఏ, ఎఫ్ఏల వేడుకోలు

నేరడిగొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా పను లు నిర్వహించేందుకు ఏపీవో, టీఏ, ఎఫ్ఏలు నిరంతరం పర్యవే క్షిస్తున్నారు. కూలీలతో సమానంగా పనులు చేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేవని వారు వాపోతున్నారు. దీంతో తమ కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయంపై పలుమార్లు విన్నవించుకున్నా అధికారుల పట్టించుకోవడం లేదు. తమ కుటుంబాలు ఆర్థికంగా సతమతమవుతున్నాయి. పస్తులే హామీ.. వేతనాలు లేని అన్న చందంగా మారిందని ఉపాధి సిబ్బంది వాపోతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో నెట్టు కొస్తున్న వారికి సకాలంలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు ఉపాధి పని జరిగే ప్రదేశాల్లో అక్రమాలకు తావివ్వకుండా పారదర్శ కంగా పనులు నిర్వహించేందుకు ఉపాధి హామీ పనిలో భాగంగా పనులను పర్య వేక్షిస్తున్న క్షేత్ర సహాయకుల నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. కూలీలతో సమానంగా పనులు చేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. పస్తు లుండాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పస్తులే హామీ.. వేతనాలు లేమి అన్న చందంగా తమ పరిస్థితి మారిందంటున్నారు.


నేరడిగొండలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

● కరువైన ఉద్యోగ భద్రత

18 ఏళ్ల నుంచి ఉపాధి హామీలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కూడా లేదని క్షేత్ర సహాయకులు వాపోతున్నారు. సకాలంలో జిల్లా ఉన్నతాధికారులకు మండల ఏపీవో, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్)లు వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది మొర పెట్టుకుంటున్నా, ఫలితం లేదు. అంతే కాకుండా ధర్నాలు రాస్తారోకో లు చేసినా ప్రభుత్వానికి పట్టడం లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఉపాధి కూలీలకు కూడా ప్రతీ వారం డబ్బులు ఇవ్వాలని చట్టం చెబుతున్నా 8 నుంచి 10 వారాల డబ్బులు కూలీలకు రావాల్సి ఉంది. తమకు వేతనాలు సకాలంలో రాకపోగా, కూలీల వేతనాలు కూడా ఆలస్యం అవు తుండడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆందోళన చెందుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక వ్యాపారం

- అర్ధరాత్రి ఖాళీ అవుతున్న ఇసుక లారీలు
- స్థానిక అధికారులు, ఇసుకాసురులతో మిలాఖత్ అయిన నిర్మల్ వ్యాపారి

బోథ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా బోథ్ మండలంలో మాత్రం ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అడిగేవాడు లేనప్పుడు బెదిరించే వాడిదే రాజ్యం అన్నట్టుగా ఇసుక మాఫియా వ్యవహరిస్తోంది. మండలానికి పక్క జిల్లా కేంద్రం అయినా నిర్మల్ జిల్లాలోని పెద్ద వాగు నుంచి దర్జాగా ఇసుక రవాణా జరుగుతోంది.

● పట్టించుకోని అధికారులు


నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ఇసుక వ్యాపారి తన లారీలలో నిర్మల్ జిల్లాలోని పెద్ద వాగు నుంచి రాత్రికి రాత్రి తీసుకువచ్చి మండల కేంద్రంలోని ఇసుక వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. రాత్రిపూట వచ్చిన ఇసుక లారీ రోడ్డు పక్కనే జెసిబీలతో ఖాళీ అవుతున్న పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారుల కళ్లెదుట ఇసుక మాఫియా వారి పని వారు చేసుకుపోతున్న చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పైగా ఇసుక కొనుగోలు చేస్తున్న వ్యాపారులు స్థానిక అధికారులతో చేతులు కలిపి అడ్డగోలుగా వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిర్మల్ నుంచి వచ్చే లారీలు 30 టన్నుల ఇసుక రావాల్సి ఉండగా 60 టన్నులు తీసుకొస్తున్నా.. రవాణా శాఖ అధికారులకు కనిపించడం లేదా!? అన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇంటి అవసరాల కోసం ట్రాక్టర్లు ఇసుక తెచ్చుకుంటే పట్టుకొని కేసులు వేసే అధికారులు ఇంత జరుగుతున్నా.. ఎందుకు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు అన్న సందేహం కలుగుతోంది.


ఇతర ప్రాంతాల నుంచి లారీలో తీసుకొచ్చిన ఇసుకను ఖాళీ చేస్తున్న కూలీలు

● గ్రామాలకు తరలించి విక్రయాలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లభించని ఇసుక ప్రైవేట్ ఇళ్ల నిర్మాణం చేసుకునే వారికి ఇసుక కావాల్సినంత లభిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. నేరుగా రాత్రికి రాత్రి ఇసుక రావడంతో పాటు అదే రాత్రి ఖాళీ అవుతుంది. అంతేగాక ఇసుక వ్యాపారులు అడుగు ముందుకు వేసి నేరుగా గ్రామాల్లోకి తరలించి విక్రయాలు జరుపుతున్నారు. అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయకపోతే నిజాయితీగా వ్యాపారం చేసే వారికి నష్టం జరుగుతుందని ఇసుక వ్యాపారులు పేర్కొంటున్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 ၊ కనిష్ఠం 24.6
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 5 జూలై 2025



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామడ, పరి మండల్, తాండ్ర, కొరిటికల్, మేడిపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలయ్య శుక్రవారం తెలిపారు. వ్యవసాయ మోటార్ల లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని, అందుకే విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.







టెండర్!

- బాసర ఆర్జీయూకేటీ మెస్ టెండర్‌లలో రాజకీయ ఒత్తిళ్లు
- అధికారులకు తలనొప్పిగా మారిన వైనం
- నిజాయితీగా వ్యవహరించిన ఏవోపై వేటు వేయించిన మెస్ సిండికేట్
- టెండర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు జంకుతున్న అధికారులు

బాసర, జూలై 4(ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ మెస్‌ల టెండర్‌లు అధికారులకు తలనొప్పిగా మారింది. నెల రోజుల్లో ముగిస్తామని టెండర్‌లు పిలిచిన అధికారులు.. నాలుగు నెలలైనా పూర్తి చేయడం లేదు. రాజకీయ, పై అధికారుల ఒత్తిళ్లతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ నిర్ణయం తీసుకుంటే ఏం అవుతుందో అని భయం అధికారుల్లో కనిపిస్తోంది. ఫలితంగా టెండర్‌లను ఖరారు చేయకుండా నాన్చుతున్నట్లు అర్థమవుతోంది. టెండర్‌ల ప్రక్రియలో ఏ విషయాన్ని బయట పెట్టడం లేదు. ఫైనలైజేషన్ ఎవరికి తెలియకుండా రహస్యంగా ఉంచుతున్నారు. ఎక్కడ లీక్ అయితే.. ఎక్కడ నుంచో ఫోన్ వస్తుందో అన్న భయంలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియలో బాధ్యతలు నిర్వర్తించిన పరిపాలన అధికారిపై సిండికెట్ వేటు వేయించినట్లు యూనివర్సిటీలో చర్చించుకుంటున్నారు. ఈ ఘటనతో ఏం చేస్తే ఏం అవుతుందో అన్న ఆందోళన అధికారుల్లో నెలకొన్నట్లు తెలిసింది. సాధారణంగా టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్‌లు భయపడతారు. ఆర్జీయూకేటీలో మాత్రం మెస్ టెండర్‌లు అంటేనే అధికారులు జంకే పరిస్థితి నెలకొంది.

నెల అన్నారు.. మూడు నెలలైనా..

తొమ్మిది వేల మంది విద్యార్థులకు భోజన బాధ్యతలు చేపట్టేందుకు నాలుగు మెస్‌లకు మార్చి 20వ తేదీన టెండర్‌లు పిలిచారు. అది కూడా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నెల రోజులు అంటే.. ఏప్రిల్ మూడో వారం లోపు టెండర్‌లను ఖరారు చేయాలి. 2025-26 విద్యా సంవత్సరానికి కొత్త మెస్ కాంట్రాక్టర్‌లను సిద్ధం చేస్తామని అధికారులే ప్రకటించారు. ప్రస్తుతం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ దశలో ఉంది. నెల రోజుల్లో పూర్తి చేస్తామన్న టెండర్ ప్రక్రియ నాలుగు నెలలు అవుతున్నా.. ఇంకా ఎటు తేల్చలేదు. విద్యార్థుల ఫిర్యాదుల మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఇప్పటి కాంగ్రెస్ హయాంలోని మంత్రి సీతక్క వంటి ప్రభుత్వ పెద్దలు మెస్ టెండర్‌లను వెంటనే నిర్వహించాలని ఆదేశించినప్పటికీ అధికారులు సకాలంలో నిర్వహించకుండా ఆలస్యం చేస్తూనే ఉన్నారు.

నాలుగవ మెస్ పేరిట జాప్యం

ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో మూడు మెస్‌లు మరో కొత్త మెస్ యూనివర్సిటీ పరిపాలన భవనం పక్కన సిద్ధం చేశారు. మూడు సంవత్సరాల కిందటే భవనం పూర్తయింది. అప్పటి అధికారులు మెస్‌కి సంబంధించిన కిచెన్ ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేశారు. కరోనా కారణంగా ప్రారంభించలేకపోయారు ప్రస్తుతం కొనసాగుతున్న మూడు మెస్‌లకు అదనంగా ఈ కొత్త మెస్‌ను ప్రారంభించేలా నాలుగు సంస్థలను ఆహ్వానిస్తూ.. టెండర్ పిలిచారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడానికి కొత్త మెస్‌లు పనులు ఉన్నాయంటూ.. అధికారులు కారణాలు చెబుతున్నారు. టెండర్‌ల ఖరారుకు ఈ కొత్త మెస్‌లో పనులకు సంబంధం లేదని కావాలనే అధికారులు ఇలా చెప్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **నాలుగు వారాల్లో పూర్తి చేస్తాం**
> **• వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్**
>
> యూనివర్సిటీలో మెస్ టెండర్‌ల ప్రక్రియ కొనసాగుతోంది. నాలుగు వారాల్లో పూర్తి చేస్తాం. ప్రస్తుతం మూడు మెస్‌లు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే నాలుగో మెస్‌లో వివిధ పనులు చేపట్టాల్సి ఉంది. అవి పూర్తిగా కాగానే నాలుగు మెస్‌లు ఒకేసారి ప్రారంభవుతాయి.

పాత కాంట్రాక్టర్‌ల కోసమేనా?

టెండర్‌ల ఖరారు కాకపోవడానికి అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం యూనివర్సిటీలో కొనసాగుతున్న మూడు మెస్ సంస్థల కాంట్రాక్టు గడువు నాలుగు సంవత్సరాల కిందటే ముగిసింది. అధికారులను మేనేజ్ చేస్తూ వివిధ కారణాలు చేబుతూ కాంట్రాక్టును పొడిగించుకుంటూ వస్తున్నారు. ఫుడ్ పాయిజన్ జరిగి వందలాది మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైనా.. అలాంటి మెస్‌లనే ఇంకా కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో కేటీఆర్ వంటి మంత్రులు ఎనిమిది నెలల కిందట మంత్రి సీతక్క ఆదేశించినా పాత మెస్‌లను మార్చడం లేదు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ జాప్యం జరగడానికి వెనక కూడా పాత మెస్ కాంట్రాక్టర్‌లపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూనివర్సిటీలో సాధ్యమైనంత వరకు ఇలాగే మెస్‌లు నిర్వహించుకునేలా ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. మరికొన్ని రోజుల్లో యూనివర్సిటీలో పూర్తి స్థాయిలో తొమ్మిది వేల మంది విద్యార్థులతో ప్రారంభం కానుంది. ఒక్కసారి విద్యార్థులు ఉన్నప్పుడు క్యాంపస్‌కు వస్తే పాత, కొత్త కాంట్రాక్టర్‌ల మార్పు చేయాలంటే సమస్యలు ఉత్పన్నం అవుతాయి.

నిజాయితీ అధికారిపై మెస్ సిండికేట్ ప్రతాపం

నిజాయితీ అధికారిగా పేరుందని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారి రణధీర్‌ని తప్పించడం వెనుక మెస్ సిండికెట్ ఉన్నట్లు యూనివర్సిటీలో చర్చించుకుంటున్నారు. టెండర్ నిబంధనలు ప్రకారం అర్హత లేని ఓ సంస్థను టెండర్ నుంచి తప్పించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారుల నుంచి యూనివర్సిటీ అధికారులపై ఒత్తిడి చేయించి సదరు సంస్థ ఏవోపై వేటు వేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చర్యతో మిగతా అధికారుల్లో భయం పుట్టుకుంది. ఏ నిర్ణయం తీసుకుంటే ఏమవుతుందో అని జంకుతున్నారు. చాలా మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వీరికి కూడా టెండర్ ప్రక్రియలో వివిధ బాధ్యతలను ఉపయోగించారు. స్వేచ్ఛగా విధులు నిర్వహించలేకపోతున్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లాంటి ఉన్నతమైన అధికార స్థానానికి ఇబ్బందులు ఎదురవుతుంటే చిన్నస్థాయి ఉద్యోగులు మెస్ సిండికెట్‌లకు మరింత ఆందోళన చెందుతున్నారు.

భైంసాలో కలకలం రేపిన మావోయిస్టు ఆత్మ పరిరక్షణ పోస్టర్లు



భగత్ సింగ్ విగ్రహానికి అతికించిన పోస్టర్

భైంసా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో మావోయిస్టు అగ్రనాయకులకు సందేశం ఇచ్చేలా మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజా ఫ్రంట్ పేరిటా వెలువడిన పోస్టర్లు కలకలం రేపాయి. శుక్రవారం స్థానిక కమల థియేటర్ రోడ్డు మార్గంలోని భగత్‌సింగ్ విగ్రహానికి సంబంధిత పోస్టర్లు అతికించబడ్డాయి. ఇందులో మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజా ఫ్రంట్ మావోయిస్టు అగ్రనాయకులకు పలు సూచనలు, సందేశాన్ని అందించారు. ఇకనైన మీ కాలం చెల్లిన సిద్ధాంతాన్ని వీడి కాలానుగుణంగా మారిన ప్రజల జీవన విధానంలో పాత్రులు కావాలని పోస్టర్ ద్వారా పిలుపునిచ్చారు. అంతే కాకుండా అడవి నీ వీడి ప్రజల్లోకి రండి-ప్రజాస్వామ్య గొంతుక కండి. అయుధాలు మన కొద్దు-ప్రజామోద మార్గమే మనకు ముద్దు అంటూ సందేశాన్ని ఇచ్చారు. ఇంకా ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చి మీ మేధస్సును ప్రజల అభివృద్ధికి ఉపయోగించాలంటూ మావోయిస్టులకు ఆత్మ పరిరక్షణ ప్రజా ఫ్రంట్ విజ్ఞప్తి చేసింది. ఎప్పుడు లేని విధంగా భైంసాలో మావోయిస్టు ఆత్మపరిరక్షణ ప్రజా ఫ్రంట్ పేరిటా వెలువడ్డా పోస్టర్‌పై సర్వత్రా చర్చ కొనసాగింది. కొద్ది మేర మవోయిస్టులపై వ్యతిరేకతతో, ఇంకో కొద్ది మేర సూచనలు, సందేశాలిచ్చే రీతిలో అతికించబడ్డా పోస్టర్లపై అందరి దృష్టి పడింది. సంబంధిత పోస్టర్లలోని వివరాలను అక్కడి మార్గం మీద రాకపోకలు నిర్వహించే వారందరూ ఆసక్తితో చదువుకుంటూ కనిపించారు.

వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్

సోన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): న్యూ వెల్మల్ బొప్పారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వ్యాధులు ప్రబలకుండా పటిష్ట మైన నివారణ, నియంత్రణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా డ్రైడేను క్రమబద్ధంగా నిర్వహించి దోమల వృద్ధిని అడ్డుకోవాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశిష్‌రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ పాల్గొన్నారు.

ఖానాపూర్ బస్టాండ్ తనిఖీ

ఖానాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్మల్ డిపో మేనేజర్ పండరి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ పరిధిలో నిర్వహిస్తున్న స్టాల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాల్స్ నిర్వాహకులు నిబంధనలను ఉ ల్లంఘించవద్దన్నారు. నిబంధనల ప్రకారం ఏ వ్యాపారం చేసుకునేందుకు స్టాల్స్‌ను అద్దెకు తీసుకున్నారు. అదే వ్యాపారాన్ని ఆయా స్టాల్స్‌లో కొనసాగించాలన్నారు. ప్రైవేట్ వాహనాలను బస్టాండ్ ఆవరనలో తిరగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక కంట్రోలర్‌ను ఆదేశించారు.

వాహనాల తనిఖీ

తానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర తానూర్‌లోని ప్రధాన రోడ్డుపై శుక్రవారం ఎస్సై షేక్ జూబర్ వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

21 రోజుల్లో 76 మొబైల్ ఫోన్ల రికవరీ

- పోగొట్టుకున్న 76 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత
- ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్



మొబైల్ ఫోన్లను అందజేస్తున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి కేవలం 21 రోజుల్లోనే 76 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 76 మొబైల్ ఫోన్లు (సుమారుగా తొమ్మిది లక్షల పన్నెండు వేల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఎస్పీ మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1496 ఫోన్లు (సుమారుగా కోటి డెబ్బై తొమ్మిది లక్షల యాభై రెండు వేల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించామ న్నారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే లైసెన్స్‌ల రద్దు

- నిర్మల్ జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్
- ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



దిలావర్‌పూర్‌లో ఎరువుల బస్తాలను తనిఖీ చేస్తున్న డీఏవో, ఏడీఏవో

దిలావర్‌పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, క్రిమి సంహారక మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ హెచ్చ రించారు. శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు విద్యాసాగర్‌తో కలిసి మండలంలోని విత్తన, ఎరువులు, క్రిమి సంహార మందులు దుకాణాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కొంత మంది డీలర్లు నిర్ణీత ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, బిల్లుపై నిర్ణీత ధరను రాసి అదనంగా డబ్బులు తీసుకుంటున్నట్లు తెలిసిందని అటువంటి వారు తీరు మార్చు కోవాలని సూచించారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. మరికొందరు కాలం చెల్లిన క్రిమి సంహారక మందులను అమాయక రైతులకు అంటగడుతున్నట్లు తెలిసిందన్నారు. రైతులు కొనుగోలు చేసిన మందు డబ్బాలను, రషీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కాలం చెల్లిన మందులను షాపుల్లో ఉంచవద్దన్నారు. ఇకపై తరచుగా తనిఖీలుంటాయన్నారు.

నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

- నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

నిర్మల్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో వివిధ స్కాలర్ షిప్‌లు పొందుతున్న విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తొందరగా నమోదు చే యాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మూడారపు పరమేశ్వర్‌తో కలిసి తెలిపారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ స్కీమ్‌లో భాగంగా ఈ సంవత్సరం జిల్లా నుండి 54 మంది ఎంపికయ్యారని వీరందరినీ ఫ్రెష్‌గా ఎన్ఎస్‌పీ పోర్టల్‌లో నమోదు చేయలని సూచించారు. అదే విధంగా గతంలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పొందిన వివిధ సంవత్సరాలకు చెందిన 83 మంది విద్యార్థులను ఈ సంవత్సరం ఎన్ఎస్‌పీ పోర్టల్‌లో రెన్యువల్ చేయాలని తెలిపారు. ఈ సంవత్సరం కొత్తగా స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థుల వివరాలను ఎన్ఎస్‌పీ పోర్టల్‌లో నమోదు చేసేటప్పుడు ప్రధానోపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసు కోవాలని సూచిం చారు. ఈ సంవత్సరం సెలెక్షన్ లిస్టులో గల విద్యార్థి పేరు ఉన్న విధంగానే బ్యాంక్ అకౌంట్‌లో కూడా పేరు అదే విధంగా ఉండాలని అన్నారు. విద్యార్థికి తప్పనిసరిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ ఉండాలని, అలా వీలుకాని పక్షంలో ఏదైనా జాతీయ బ్యాంక్‌లో అకౌంట్ తీసు కోవాలని పేర్కొ న్నారు. పోస్ట్ ఆఫీస్, గ్రామీణ బ్యాంక్‌లలో తీసుకున్న అకౌంట్‌లు చెల్లవని స్పష్టం చేశారు. జాయింట్ అకౌంట్, పోషకుల అకౌంట్, ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల అకౌంట్ నెంబర్ ను విద్యార్థి అకౌంట్‌కు బదులుగా వాడ కూడదని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గడువులోగా విద్యార్థులను వివరా లను ఎన్ఎస్‌పీ పోర్టల్‌లో నమోదు చేయకుంటే స్కాలర్ షిప్‌లు రెన్యూవల్ గాని, కొత్తవి గాని మంజూరు చేయబడవని, దీనివల్ల విద్యార్థులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

భైంసా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభకు ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ మైనార్టీ ప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. భైంసా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్ మిలన్, నియోజక వర్గ ప్రతినిధులు ఆహ్మద్ మోహిద్దీన్, హఫీజుల్లాఖాన్, ఆహ్మద్‌ఖాన్, ముఖీద్‌ల నేతృత్వంలో మైనార్టీ ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఉదయం వేళలో స్థానిక మిలన్ మెస్ వద్ద భేటి అయిన కాంగ్రెస్ మైనార్టీ ప్రతినిధులు బస్టాండ్ మీదుగా గాంధీ గంజ్ వరకు వాహనాల తో ర్యాలీ చేపట్టారు. అనంతరం హైదరాబాద్ సభలో పాల్గొనేందుకు భారీ వాహన శ్రేణితో పయనమయ్యారు.

ఖానాపూర్: హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సభకు ఖానాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యనారాయణ, అంకం రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగా నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గొర్రె గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా తోట సత్యం, మడిగెల గంగాధర్ హైదరాబాద్‌కు తరలి వెళ్లారు.

బంగారు గొలుసు దొంగిలించిన మహిళల అరెస్టు

- కేసును ఛేదించిన పట్టణ పోలీసులు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

నిర్మల్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బంగారు గొలుసు దొంగిలించిన మహిళలను అరెస్ట్ చేసినట్లు అదనపు ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 30న సాయంత్రం 5 గంటలకు నిర్మల్ బస్టాండ్ వద్ద కడెం మండలానికి చెందిన కిష్టమ్మ అనే మహిళ మెడలో నుంచి 2 తులాల బంగారు గొలుసు దొంగిలిం చారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఆదేశాలతో అదనపు ఎస్పీ రాజేష్ మీనా సూచనలతో ప్ర వీణ్ కుమార్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సీసీఎస్ టీం బస్టాండ్ వద్ద గల సీసీ టీవీలను తనిఖీ చేయడం మొదలు పెట్టగా ఆదిలాబాద్‌లోని పిట్టల వాడకు చెందిన సాగింటి లక్ష్మీ, పట్టణంలోని బంగల్‌పేట్‌కు చెం దిన పండెన కవిత నిందుతులుగా గుర్తించారు. అట్టి మహిళలు శుక్ర వారం దొంగిలించిన బంగారాన్ని అమ్మడానికి వెళ్తుండగా గాంధీ చౌక్ వద్ద వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహి ళల నుంచి 2 తులాల బంగారు గొలుసు, దొంగలించడానికి ఉపయో గించిన కత్తెరను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మీనా మాట్లాడుతూ సీసీటీవీల ఆధారంగా దొంగలను పట్టుకున్నామన్నారు. అన్ని దుకాణాల్లో, గృహ సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ ఫుటేజీ ద్వారా దొంగలను ప ట్టుకోవచ్చని తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ప్రవీణ్ కుమార్ ఇన్స్‌పెక్టర్, సంజీవ్ ఎస్సై, జిల్లా సీసీఎస్ టీం సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్

మామడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మామడను ఆక స్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడు తూ రోగులకు మెరుగైన నాణ్యమైన సేవలను అందించాలని కోరారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వ్యాధుల నియంత్రణకు, నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అదే విధంగా వ్యాధులు ప్రబలిన చోట వెంటనే స్పందించి ఆరోగ్య శిబిరాలను నిర్వహించి చికిత్సలను అందించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు అందుబాటులో లేనట్లయితే వైద్య సిబ్బందికి చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ ఆశిష్ రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారె రవీందర్, వైద్యాధి కారి డాక్టర్ మౌనిక, హెల్త్ అసిస్టెంట్లు మధుకర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై డీఎల్పీవో విచారణ

ఖానాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీర్నంది గ్రామంలో నెలకొన్న ఓ సమస్యపై ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్మల్ డీఎల్పీవో అజీజ్ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీకి నిధులు మంజూరు అయ్యే వరకు ఎటువంటి తవ్వకాలు చేపట్టవద్దని సూచించారు. ఆర్ అండ్ బీ శాఖ అనుమతి లేకుండా రోడ్ల తవ్వకాలను నిర్మించవద్దని సూచించారు. పైప్ లైన్ ద్వారా మురికి నీటిని డ్రైనేజీ వరకు తరలంచాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీఎల్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో స్థానిక మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్ రావు, ఎంపీవో కార్యాలయ సిబ్బంది సాగర్, స్థానిక పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.